క్లుప్తంగా

దేశభక్తి నిండా.. వరి పంటకు అండ



పంట చేలో ఏర్పాటు చేసిన చిత్ర పటాలు

ఉండి: కొందరి ఆలోచనలు వినూత్నంగాను, వింతగాను ఉంటాయి. అదే కోవలో ఓ రైతు విరగపండిన తన వరి చేనుకు ఏకంగా జాతీయ నాయకుల ఫొటోలను రక్షణ కవచంగా పెట్టుకున్నారు. మండలంలోని యండగండి శివారులో విరగపండిన తన వరి పొలాన్ని పక్షులు పాడు చేయకుండా వినూత్నంగా ఆలోచించడమే కాకుండా తన దేశభక్తిని చాటుకున్నాడు. వరి చేలో జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేసి పతాకానికి ఇరువైపులా జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, రతన్‌టాటా, కాటన్ దొర చిత్ర పటాలను ఏర్పాటు చేసి తనలోని దేశభక్తిని చాటుకున్నాడు. రైతు చేసిన పని భీమవరం, తాడేపల్లిగూడెం రోడ్డులో వెళ్లే ప్రతి ఒక్కరినీ విశేషంగా ఆకట్టుకుంటుంది.

ప్లాస్టిక్ నిషేధం సామాజిక బాధ్యత

భీమవరం (ప్రకాశంచౌక్): ప్లాస్టిక్ వ్యర్థాలతో కాలువలు నిండిపోతున్నాయని, కాలువలో వ్యర్థ పదార్థాలను వేయకూడదని నీటి పారుదల శాఖ డివిజనల్ ఇంజనీర్ పి.సత్యనారాయణ మూర్తి అన్నారు. బుధవారం భీమవరం పురపాలక సంఘం, శ్రీవిజ్ఞాన వేదిక, నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలని, గుడ్డ, చేతి సంచులను ఉపయోగించాలని సూచించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెండు నెలలుగా ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. నిషేధ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు మాట్లాడుతూ అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని, దాతల సహకారంతో ప్రతి ఒక్కరికీ గుడ్డ సంచులను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సెక్రటరీ, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

హిందీ పరీక్షకు 14 మంది గైర్హాజరు

కాళ్ల: మండలంలో బుధవారం నిర్వహించిన హిందీ పరీక్షకు 14 మంది గైర్హాజరయ్యారు. కాళ్ల హైస్కూల్‌లో 210 మంది, కోపల్లెలో 201కి గాను ముగ్గురు, కలవపూడిలో 108కి గాను ఆరుగురు, ఏలూరుపాడు జెడ్పీ హైస్కూల్‌లో 203 మందికి గాను ఐదుగురు విద్యార్థులు, మొత్తం 14 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి ఎ.రవీంద్ర తెలిపారు. మండలం మొత్తం 722 మంది హాజరుకావాల్సి ఉండగా 708 మంది హిందీ పరీక్ష రాసినట్లు వివరించారు.

కార్యకర్తను కోల్పోవడం బాధాకరం



శ్యాంబాబు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆకివీడు: నిబద్ధతతో పని చేసే కార్యకర్తను కోల్పోవడం దురదృష్టకరమని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య, నియోజకవర్గ సీనియర్ నాయకులు మంతెన సునిల్ కుమార్ అన్నారు. మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో నివసించే ప్యాకింగ్ కార్మికుడు, వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఎరిచర్ల శ్యాంబాబు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబాన్ని పార్టీ నాయకులు బుధవారం పరామర్శించారు. కార్యక్రమంలో ఎరిచర్ల సాంబర్లిన్, గ్లాడ్ సన్, కుటుంబ సభ్యులు వై.యోనా, మోషేస్,వై.నరేష్, అశోక్, పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలను ప్రోత్సహించాలి

నరసాపురం రూరల్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలను పోత్సహిస్తున్న స్వర్ణాంధ్ర యాజమాన్యం అభినందనీయమైనదని ఆర్టీసీ డీఎం సుబ్బన్నరెడ్డి అన్నారు. బుధవారం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కొండవీటి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 25వ తేదీ నుంచి కళాశాలలోని ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులతో పాటు అధ్యాపకులకు ఆటల పోటీలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో భాగంగా 2024-2025 సంవత్సరానికి జెఎన్‌టీయూకె సౌత్‌జోన్ పోటీల్లో బాస్కెట్ బాల్ పోటీల్లో గెలుపొందిన కె.రవితేజారెడ్డి, డి.సునీత (టేబుల్‌టెన్నిస్), డి.భీమేశ్వర్ (ఫుట్ బాల్) కె.సంతోష్ (కరాటే) లను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి కేవీ స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, పాలకవర్గ సభ్యులు ఎంవీ రామచంద్రరావు, ప్రిన్సిపాల్స్ డాక్టర్ సురేష్‌కుమార్, పండరీనాథ్, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

కొత్త వంతెన నిర్మాణమెప్పుడో ?

- శిథిలావస్థకు చేరిన వంతెన
- అధికార యంత్రాంగానికి పట్టని వైనం
- ఆందోళనలో వాహనదారులు, ప్రయాణికులు

భీమవరం అర్బన్: పట్టణ పరిధిలోని కాళీపట్నం రోడ్డులో లాకుల వద్ద కాళీపట్నం చానల్‌పై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. సుమారు మూడున్నర దశాబ్దాల క్రితం అప్పటి జనావసరాల కోసం ఈ వంతెనను నిర్మించారు. ఈ మార్గం గుండా మండలంలో యనమదుర్రు, దిరుసుమర్రు, దెయ్యాలతిప్ప, నాగిడిపాలెం, రామాయణపురం గ్రామాల మీదుగా జాతీయ రహదారిలో కలుస్తుంది. మొగల్తూరు, నరసాపురం మండలాలతో అనుసంధానం కలిగి ఉంది. ఈ మార్గం పరివాహకంలో ఆక్వా ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఐస్ ఫ్యాక్టరీలు ఉండటంతో నిత్యం భారీ వాహనాలు, చేపల లోడులు, స్కూల్ బస్సులు, వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వంతెనకు ఇరువైపులా డబల్ రోడ్డుతో వంతెన వద్ద ఇరుకుగా ఉండటంతో భారీ వాహనాలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. ఎప్పుడో నిర్మించిన ఈ వంతెన ఇప్పుడు ప్రయాణికులు, వాహనదారులు రద్దీ పెరగడంతో అవసరాలు తీర్చలేకపోతుంది. దీంతో కొత్త వంతెన నిర్మించాలని కోరుతున్నారు.



కాళీపట్నం రోడ్డులోని లాకుల వద్ద ఇరుకుగా ఉన్న వంతెన



వంతెనకు ఒక వైపు తడికలలో గ్రావెల్ వేసి పూడ్చిన దృశ్యం

వంతెన ఓ వైపు కూలిపోయింది

వంతెనకు ఓ వైపు కూలడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు తడికల్లో గ్రావెల్ వేసి పూడ్చారు. రాత్రులు కొన్ని వాహనాలు అదుపు తప్పి ఆ గ్రావెల్‌లో పడి దిగబడిపోతున్నాయని వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన కూలితే రూరల్ గ్రామాల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అధికారులు సమస్య వచ్చాక పరిష్కారిద్దామనే ధోరణిలో ఉన్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సమస్య రాకముందే నూతన వంతెనను నిర్మించాలని గ్రామస్తులు, ప్రయాణికులు కోరుకుంటున్నారు.

వంతెన వద్ద ఇరుకుగా రోడ్డు

ఈ వంతెన వద్ద రోడ్డు ఇరుకుగా, ఎత్తుగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు ఒక్కోసారి కనిపించక అయోమయానికి గురై ప్రమాదాలకు గురవుతున్నాం. అంతే కాకుండా కాళీపట్నం వైపు రింగ్ రోడ్డు మాదిరిగా ఉండటంతో భారీ వాహనాలు వెళ్లలేకపోతున్నాయి.



–వాటాల విజయ్ కుమార్, ప్రయాణికుడు, నాగేంద్రపురం

నూతన వంతెనను నిర్మించాలి

వంతెనకు ఒక వైపు పెచ్చులూడి ధ్వంసమవుతుంది. అధికారులు తడికల్లో గ్రావెల్ వేసి పూడ్చుతున్నారు. కాని కొత్త వంతెనలకు ప్రతిపాదనలు చేయడం లేదు. సమస్య వస్తేనే కాని స్పందించేటట్లు లేరు. ఆ వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మించి సమస్యను పరిష్కరించాలి.



–బద్దా శాంతారాం, గ్రామస్తుడు, యనమదుర్రు

ఎస్సీ వర్గీకరణ తగదు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పాలకోడేరు: ఎస్సీ వర్గీకరణ తగదని తీవ్రంగా ఖండించారు. కుముదవల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని వెంటనే ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దళితులను విడదీసే కుట్రలో భాగంగానే బీజేపీ, కూటమి ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని నిరసన వ్యక్తం చేశారు. కొండేటి లాజరు, గాతల సందీప్, మీసా ల రాజు, అంబటి ఆనంద్, గండి నాని, కురుకుంటి పౌలు, బండి మధు, గొల్ల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సహకార సంఘాలతోనే గ్రామీణాభివృద్ధి సాధ్యం

ఉండి: సహకార సంఘాలు ప్రజలకు చేరువలో ఉండి అవసరాలు తీర్చడంలో ముందుంటాయని గ్రామీణాభివృద్ధి సహకార సంఘాలతోనే సాధ్యం అవుతుందని జిల్లా సహకార అధికారి ఎం.నాగరాజు అన్నారు. ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని యండగండిలో విశాల సహకార పరపతి సంఘం కార్యదర్శి సీహెచ్ ఎస్వీఎస్ఆర్‌కే రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా అధికారి నాగరాజు, సంఘ పీఐసీ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.రామదాసు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సహకార సంఘ భవనం వద్ద సహకార పతాకాన్ని అధికారులు ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర సహకార యూనియన్ విజయవాడ జోనల్ విద్యాధికారి కె.భోజరంగరాజు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రమణమూర్తి మాట్లాడుతూ సహకార సంస్థలు మెరుగైన ప్రపంచాన్ని నిర్మిస్తాయి అనే నినాదంతో సహకార రంగంలో ఈ ఏడాది పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భీమవరం సబ్ డివిజినల్ అధికారి సత్యనారాయణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ హనుమంతురావు, జీవనజ్యోతి సిబ్బంది ఫణికుమార్, డి.శేషుబాబు, వసుంధర, వర్థిని, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

ముగిసిన అమ్మవార్ల జాతర

కాళ్ల: మండలంలోని బొండాడ గ్రామంలో కొలువైన గ్రామ దేవతలు శ్రీపోలేరమ్మ, శ్రీమహాలక్ష్మి అమ్మవార్ల 50వ జాతర మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. దీనిలో భాగంగా అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. తొలుత అమ్మవార్లకు భారీ నైవేద్యం సమర్పించారు. ఈ అన్నదానంలో సుమారు 4000 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీటి సంఘం అధ్యక్షుడు మందపాటి కృష్ణమూర్తి మాట్లాడుతూ ఈ నెల 9న ప్రారంభమైన జాతర మహోత్సవాలు గ్రామస్తులు సహకారంతో అత్యంత వైభవంగా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో గొర్ల లక్ష్మణ్, మేకా వెంకన్నబాబు, దాసరి రాజు, మందపాటి వెంకన్న, గుడిగుంట్ల ఫణీంద్ర, ఆరిటాకుల సత్యనారాయణ, ఈఓ ఆంజనేయ రాజు, జాతర కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



అమ్మవారి నైవేద్యం వద్ద పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

గాలికుంటు వ్యాధిని నిర్మూలించాలి

ఆకివీడు: పశువుల్లో గాలి కుంటు వ్యాధి ఇతర పశువులకు వ్యాప్తి చెందుతుందని మండల పశు వైద్యాధికారిణి కెల్లా భార్గవీసత్య చెప్పారు. మండలంలోని పెదకాపవరంలో పశు వైద్యశాలలో గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసే కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధి నియంత్రణకు టీకాలే ముఖ్యమన్నారు. వ్యాధి సోకిన పశువుల్లో పని సామర్థ్యం, పాడి ఉత్పత్తి తగ్గిపోతాయని ఆమె చెప్పారు. వ్యాధిని అంతమొందించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. నాలుగు నెలలు పైబడిన ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు వ్యాధి ప్రబలకుండా టీకాలు వేయించాలని సూచించారు. పశువుల్లో నోరు, కాలి గిట్టల మధ్య పుండ్లు రావడం, 104 జ్వరం ఉండటం వంటివి వ్యాధి లక్షణాలన్నారు. కార్యక్రమంలో మండల వెటర్నరీ అధికారి పరిశుద్ధం, గోపాల మిత్ర పాండురంగారావు పాల్గొన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారిణి కెల్లా భార్గవీసత్య

ఆక్రమణల తొలగింపు

వీరవాసరం: నౌడూరు జంక్షన్‌లో ఆక్రమణలను హైకోర్టు ఉత్తర్వుల మేరకు బుధవారం తొలగించారు. నిత్యం రద్దీగా ఉండే నవుడూరు జంక్షన్‌లో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురి కావడం ఆర్‌అండ్‌బీ రహదారికి ఆనుకుని ఇరువైపులా అక్రమ కట్టడాలు నిర్మించుకోవడంతో పలువురు హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ స్థలంలోని అక్రమణలను వెంటనే తొలగించాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు ఆక్రమణలను తొలగించారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ ఏఈ మూర్తి అన్నారు. తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, ఎంపీడీవో బిరుదుకోట అప్పారావు, ఎస్సై రవికుమార్, కార్యదర్శులు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో ఆక్రమణలను పూర్తిగా తొలగించారు.



నౌడూరు జంక్షన్‌లో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

సునీతా విలియమ్స్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

భీమవరం అర్బన్: సునీతా విలియమ్స్ అంతరిక్ష కేంద్రంలో 9 నెలలు గడిపి విజయవంతంగా భూమికి చేరుకున్నారని ఆమె ఓర్పు, సహనాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు బండా వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని అనాకోడేరులో డీఎన్ఆర్ హైస్కూల్‌లో ఈ సందర్భంగా సభను ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయులు బొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎనిమిది రోజులు అంతరిక్ష యాత్రకని బయలుదేరి 286 రోజులు అంతరిక్షంలో చిక్కుకుపోయి సురక్షితంగా భూమి మీద ఈ రోజు దిగిన సందర్భంగా సునీతా విలియమ్స్ సహనం, ధైర్యాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. చెకుముకి జిల్లా కన్వీనర్ రేపాక వెంకన్న బాబు మాట్లాడుతూ విద్యార్థులు సునీత విలియమ్స్ గురించి తెలుసుకోవాలని ఆమె కృషి పట్టుదలను గ్రహించాలన్నారు. అనంతరం ఆమెకు సంబంధించిన ఫొటోలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎంవీ శ్రీలక్ష్మి, డి.అనూరాధ, వై.శకుంతల, ఎం.బాల పల్లాలరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవజాతి మనుగడకు మొక్కల పెంపకమే ఆధారం

యలమంచిలి: మానవజాతి మనుగడకు మొక్కల పెంపకమే ఆధారమని నరసాపురం రెవిన్యూ డివిజనల్ అధికారి దాసి రాజు అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామీకరణ, కాంక్రీట్ రోడ్లు, వాహన కాలుష్యం వల్ల వాతావరణంలో ఉష్ణోగ్రతలు బాగా పెరిగిపోతున్నాయన్నారు. మొక్కల పెంపకం ద్వారా మాత్రమే ఈ సమస్యను పరిష్కరించగలమన్నారు. తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్, డీటీ పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఆర్డీఓ దాసి రాజు

ప్రతి నియోజకవర్గంలో మినీ జాబ్‌మేళా

ఆకివీడు: నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.లోక్‌మాన్ చెప్పారు. మండలంలోని దుంపగడపలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 22వ తేదీన మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేసేందుకు వచ్చిన ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. మెగా జాబ్ మేళాలో 11 నుంచి 15 కంపెనీల ద్వారా 600 మందికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. నియోజకవర్గ స్థాయిలో స్కిల్ హబ్‌లు విజయవంతంగా నడుస్తున్నాయని చెప్పారు. ఒక్కో హబ్‌లో 30 నుంచి 60 మంది వరకూ శిక్షణ పొందుతున్నారన్నారు. బ్యాచ్‌లుగా శిక్షణ ఇస్తున్నామన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో దుంపగడపలోనలి ప్రభుత్వ కాలేజీ ఆవరణలో ఐదు ఎకరాల స్థలాన్ని ఏర్పాటు చేశారన్నారు. నిధుల కొరత వలన భవన నిర్మాణం చేపట్టలేదని లోక్‌మాన్ చెప్పారు. తాత్కాలికంగా నర్సాపురం నియోజకవర్గంలోని పెదపాలెం లంకలో స్కిల్ కళాశాల నడుస్తుందన్నారు. ఈ గ్రామాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దత్తతు తీసుకున్నారని చెప్పారు. కాలేజీలో లెవెల్-5లో కోర్సులుంటాయని చెప్పారు. మెగా జాబ్ మేళాను దుంపగడప కళాశాల ఆవరణలో ఏర్పాటు చేయడం ఈ ప్రాంత నిరుద్యోగులకు మంచి అవకాశమని వారు పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి

మండుతున్న ఎండలు

- మార్చిలోనే భానుడి భగభగలు
- నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు
- శీతల పానీయాలకు పెరుగుతున్న గిరాకీ

భీమవరం అర్బన్: భానుడు రోజు రోజుకూ భగ భగలు పెంచుకుంటూ పోతున్నాడు. శీతాకాలం ముగియగానే మార్చిలో మే వచ్చినట్లుగా గ్రీష్మతాపం చూపిస్తున్నాడు. గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పెరగడంతో మధ్యాహ్నం వేళ రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వేసవి తాపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండ వేడిమి తీవ్రత ఎక్కువగా ఉండటంతో కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, రైతులు, వ్యాపారులు బెంబేలెత్తిపోతున్నారు. కూలీలు, రైతులు ఉదయం ఐదు గంటల నుంచి పనికి వెళ్లి ఎండొచ్చే సమయానికి ఇంటికి వచ్చేస్తున్నారు. కొన్ని చోట్ల వ్యాపారులు ఎండలకు వినియోగదారులు ఎవరూ రాకపోవడంతో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తమ షాపులను మూసి వేస్తున్నారు. మార్చిలోనే ఎండలు ఇలా ఉంటే ఏప్రియల్, మే నెలల్లో ఇంకెలా ఉంటాయోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్నం వేళ రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. కొన్ని చోట్ల ప్రయాణికులు, వాహనదారులు వేసవి నేస్తాలైన చెట్ల కిందకు, శీతల పానీయాల వద్దకు వెళ్లి సేద తీరుతున్నారు.



ఎండ తీవ్రతకు చీర కొంగు ముసుగు వేసుకుని వెళుతున్న మహిళలు

40 డిగ్రీలకు చేరుకున్న ఉష్ణోగ్రత

గత నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా ఆదివారం, సోమవారాల్లో 39, 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైంది. ఉదయం 10 గంటల నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు ఇళ్ల నుంచి రావడానికి భయపడుతున్నారు. మార్చిలోనే ఎండలు ఇలా ఉంటే ఏప్రియల్, మే నెలల్లో ఎలా ఉంటాయోనని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం ఐదు గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు పలు అవస్థలు పడుతున్నారు. ఎండ వేడికి ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు అల్లాడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఎండ వేడిని తట్టుకునేందుకు టోపీలు, మాస్కులు ధరిస్తున్నారు. మహిళలు గొడుగులు వినియోగిస్తున్నారు.



మండుటెండలో జొన్న పొత్తులు కాలుస్తున్న మహిళ

శీతల పానీయాలకు పెరిగిన గిరాకీ

భానుడి భగభగల నుంచి కొంతైనా ఉపశమనం పొందేందుకు శీతల పానీయాల వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే పెరిగిన ధరలు మాత్రంగా సామాన్యులకు నీరసం రప్పిస్తున్నాయి. చల్లదనం కోసం శీతల పానీయాలు, పళ్ల రసాల వైపు ప్రజలు ఆసక్తి చూపడంతో ఎక్కడ చూసినా శీతల పానీయాల దుకాణాలు, జ్యూస్ సెంటర్లు వెలిశాయి.

అదనపు కట్నం వేధింపుల కేసు నమోదు

భీమవరం: అదనపు కట్నం కోసం భర్త, అతని కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని గునుపూడికి చెందిన శీలంశెట్టి దివ్యశ్రీ ఉమాసోమశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి..గునుపూడికి చెందిన యర్రింకి సత్యనారాయణ కుమార్తె దివ్యశ్రీ ఉమాసోమశ్వరికి విజయవాడ అరండల్‌పేట ఉస్సేన్‌సాహెబ్ వీధికి చెందిన శీలంశెట్టి మురళీమోహన్‌తో 2012 మార్చి 8వ తేదిన వివాహమైంది. పెళ్లి సమయంలో రూ.3 లక్షలు కట్నం, రూ.50 వేలు ఆడబడుచు కట్నంతో పాటు రూ.లక్ష విలువైన సారె ఇచ్చారు. వీరి కాపురం కొంతకాలం సక్రమంగా సాగడంతో పాప పుట్టింది. తరువాత నుంచి అదనపు కట్నం కోసం భర్త మురళీమోహన్‌తో పాటు అత్త, మామలు ఇతర కుటుంబ సభ్యులు వేధించడం ప్రారంభించారు. దీంతో విసుగు చెందిన బాధితురాలి ఫిర్యాదు మేరకు భీమవరం వన్‌టౌన్ ఏఎస్సై ఎం.రామకృష్ణ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భర్తపై ఫిర్యాదు

ఉండి: గ్రామానికి చెందిన చిటికినీటి సత్యలక్ష్మి తిరుపతికి చెందిన వేంపల్లి వినోద్‌కుమార్‌ను 10 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. వివాహానంతరం అదనపు కట్నం తేవాలంటూ వేధింపులు ప్రారంభమయ్యాయి. వేధింపులు భరించలేని సత్యలక్ష్మి ఉండికి చేరుకుని కుటుంబీకుల సహాయంతో పోలీసులకు భర్త, అత్తమామలు నాగరాజు శ్రీదేవిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఉండి: జాతీయ రహదారిపై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఉండికి చెందిన కోలా పౌలు, మజ్జి అప్పన్న ద్విచక్ర వాహనంపై భీమవరం వెళుతున్నారు. ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చి సమీపానికి వచ్చేసరికి ముందు ఆగి ఉన్న మరో ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీ కొట్టారు. దీంతో ఇద్దరూ రోడ్డు మీద పడిపోయారు. వారిద్దరికి ముఖం, కాలి భాగాల్లో గాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో 108లో భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరికి కూడా స్వల్ప గాయాలు అయినట్లు తెలిసింది. కాని వారు ఘటనా స్థలం నుంచి వెళ్లిపోవడంతో వారి వివరాలు తెలియరాలేదు. దీనిపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి సమాచారం రాలేదని తెలిపారు.

ఆశీల వేలం వాయిదా

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని ఆశీల వేలం ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసినట్లు కమిషనర్ జి.కృష్ణ మోహన్ చెప్పారు. స్థానిక నగర పంచాయతీ ఆవరణలో బుధవారం ఆశీల వేలం నిర్వహించాలి. అనివార్య కారణాల వలన వేలం వాయిదా వేసినట్లు తెలిపారు. షరతులకు లోబడి వేలం నిర్వహించాలని, ఆ విధంగా నిర్వహించలేకపోతే వాయిదా వేసే హక్కు కమిషనర్‌కు ఉందని తెలిపారు. వేలంలో హెచ్చు పాటదారుడికి ఆశీలు వసూలు చేసుకునే హక్కు కల్పిస్తామని, పాటదారులు 18 శాతం జీఎస్‌టీ కట్టాల్సి ఉంటుందని చెప్పారు. రోజువారీ మార్కెట్, వారపు సంత మార్కెట్, కబేళా, రోజువారి మార్కెట్ నందలి ఖాళీగా ఉన్న షాపులు, కొబ్బరి చెట్ల ఫలసాయం, పాత పేపర్ల వేలం నిర్వహిస్తామని తెలిపారు.

రాజగోపాల స్వామి ఆలయంలో అన్నసమారాధన

నరసాపురం రూరల్: పట్టణంలోని స్టీమర్ రోడ్డులో ఉన్న రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీరాజగోపాల స్వామి వారి కల్యాణ మహోత్సవాల ముగింపు వేడుకను పురస్కరించుకుని బుధవారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు.అఖండ అన్న సమారాధన కార్యక్రమంలో సుమారు రెండు వేల మంది భక్తులు పాల్గొన్నారని వివరించారు.